సమస్యల పరిష్కారానికి కృషి



2



2

సంతకాలు ఫోర్జరీ.. ముగ్గురి అరెస్ట్

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## పాఠశాలలో పాత సామగ్రి విక్రయం

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పీఎంశ్రీ యోజన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనికిరాని పాత బెంచీలు, ఇనుప సామగ్రి విక్రయించి, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గతేడాది మిగిలిపోయిన పాత పుస్తకాలను విక్రయించగా వచ్చిన నగదును సైతం పాఠశాలకు వినియోగిస్తున్నామ్నారు. పాఠశాలలోని ఉపయోగపడని సామగ్రిని అమ్మడానికి ప్రత్యేకంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ విక్రయం ద్వారా వచ్చిన డబ్బుతో పాఠశాల ప్రధాన ద్వారం (గేటు) నిర్మాణం చేపడతామని వెల్లడించారు. ఈ ప్రక్రియ అంతా ఉన్నతాధికారుల ఆదేశాలు, వారి పర్యవేక్షణలోనే జరుగుతోందని ఆమె పేర్కొన్నారు.






## కామారెడ్డిలో భారీ వర్షం..

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంతో పాటు పాటు జిల్లా వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి అలుముకున్న నల్లని మేఘాల నేపథ్యంలో దాదాపు అరగంట పాటు ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కొన్ని రోజులుగా వర్షాలు లేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షంతో పొలాలకు నీళ్లు అందనున్నాయి. మళ్లీ దుక్కి దున్నుకునే అవకాశం లభించింది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో బోర్లపై ఆధారపడిన రైతుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. భారీ వర్షం రైతులకు లాభం చేకూర్చినా, కామారెడ్డి పట్టణ ప్రజలకు మాత్రం చుక్కలు చూపించింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. బస్ స్టాండ్, గాంధీ చౌక్, రాజీవ్ రహదారి వద్ద భారీగా నీరు నిలిచింది. డ్రైనేజీలు పొంగడంతో మురికి నీరు రోడ్లపైకి వచ్చింది. కొన్ని లోతట్టు కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరినట్టుగా తెలుస్తోంది.

## లయన్స్ క్లబ్ ఆఫ్ సహారా కార్యవర్గ ప్రమాణస్వీకారం




**అక్షరటుడే, నిజామాబాద్అర్బన్:** లయన్స్ క్లబ్ ఆఫ్ సహారా కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని మంగళవారం ఓ హోటల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. నూతన కార్యవర్గంతో లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పెంటయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. నూతన సభ్యత్వాలపై దృష్టి పెట్టాలని అన్నారు. లయన్స్ జిల్లా కార్యదర్శి డి.యాదగిరి, జిల్లా అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ, రీజియన్ ఛైర్మన్ పుల్గం హన్మాండ్లు, రీజియన్ పూర్వ ఛైర్మన్ సూర్యభగవాన్, జోన్ ఛైర్మన్లు విష్ణువర్ధన్, అబ్బాయి లింబాద్రి, రీజియన్ కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా లయన్స్ దంత విభాగం కార్యదర్శి డాక్టర్ అమర్నాథ్, సహారా క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె.అహ్మద్, దనుంజయ్, వివేకానంద్, ప్రవీణ్, రామారావ్ పాల్గొన్నారు.



# అడ్డగోలుగా ఆడిట్..

**గ్రామస్థాయి పాలనలో పారదర్శకత పెంచేందుకు, జీపీలకు వచ్చే గ్రాంట్లు పక్కదారి పట్టకుండే చూసే 'ఆడిటింగ్' మామూళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కొత్తగా ఏర్పడిన పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న మొదటి విడత ఆడిట్ ఒక పెద్ద ప్రహసనంగా మారిందని ప్రచారం సాగుతోంది. – అక్షరటుడే, డిచ్‌పల్లి**

▸ క్షేత్రస్థాయిలో పరిశీలించని అధికారులు ▸ మాముళ్లు ముట్టజెప్పుతున్న సర్పంచులు!

ప్రజల పన్నుల రూపంలోనూ, ప్రభుత్వం అందించే వివిధ రకాల గ్రాంట్ల (ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సి తదితర) రూపంలో వచ్చే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు రూపొందించిన వ్యవస్థ 'ఆడిటింగ్' (లెక్కల తనిఖీ). కానీ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో సాగుతున్న ఆడిటింగ్ సరళిని చూస్తే చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు వస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న మొదటి విడత ఆడిట్ ఒక పెద్ద ప్రహసనంగా మారింది. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో అంగుళం అంగుళం తనిఖీ చేయాల్సిన ఆడిట్ అధికారులు, గది దాటి బయటకు రావడం లేదు. అంతా 'మామూలు' వ్యవహారంగా మార్చేసి, ఆడిట్‌ను చుట్టేస్తున్నారు.

### క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది?

జిల్లాలోని పలు మండలాల్లో ఈ నెలలో ఆడిట్ ప్రారంభమైంది. నిబంధనల్ని పాతర వేసి ఆడిట్ చేస్తున్నట్లు తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. ఓ మండల కేంద్రంలోని ఏదైనా ఒక పెద్ద గ్రామ పంచాయతీ భవనంలో ఆడిట్ అధికారులు కూర్చుని చుట్టుపక్కల ఉండే 8 నుంచి 10 గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఫోన్లు చేసి సమాచారం తెప్పించుకుంటున్నారు. 'ఫలానా ఆఫీసులో ఉన్నాము.. మీ జీపీ రికార్డులు తీసుకురండి..' అని ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శులు సైతం కార్లు, బైక్‌లపై రికార్డుల మూటలను వేసుకుని అధికారులు ఉన్న చోటికే పరుగులు తీస్తున్నారని సమాచారం.

### కాగితాలు దాటని కన్ను..

ఒకే గదిలో కూర్చుని పదుల సంఖ్యలో ఉన్న పంచాయతీల రికార్డులను గంటల వ్యవధిలోనే పరిశీలించేస్తున్నారు. అక్కడ జరిగిన పనులేంటి..? వేసిన రోడ్లు ఉన్నాయా, కొట్టుకుపోయాయా..? నాటిన మొక్కలు బతికాయా లేదా? అనే ప్రాథమిక స్పృహ లేకుండా కేవలం బిల్లుల వెనుక సంతకాలు పెట్టేసి మమ అనిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కోరిన భోజనం.. నజరానాలు..

ఆడిట్ చేసేందుకు వచ్చిన అధికారులకు సర్పంచులు, కార్యదర్శులు రాజభోగాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆడిటింగ్ జరుగుతున్న రోజుల్లో అధికారుల భోజనం బాధ్యత అంతా సర్పంచులదే. విందులతో పాటు, రికార్డుల్లో ఏవైనా తప్పులున్నా, నిధుల వినియోగంలో అక్రమాలున్నా బయటపడకుండా ఉండేందుకు ఆడిట్ అధికారులకు పంచాయతీ స్థాయిని బట్టి నగదు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు, విందులు అందిన వెంటనే ఆడిట్ అధికారులు రికార్డులన్నింటికీ 'ఆల్ ఈజ్ వెల్' అంటూ క్లీన్‌చిట్ ఇచ్చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎలాంటి అభ్యంతరాలు రాకుండా, లోపాలున్నా వాటిని కప్పిపుచ్చి ఆడిట్ నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

### ఆకస్మిక తనిఖీలు అవసరం

జిల్లా ఆడిట్ అధికారి, కలెక్టర్ స్వయంగా ఆడిట్ జరుగుతున్న ప్రదేశాలను, అలాగే ఆడిట్ పూర్తయిన గ్రామాలు కొన్నింటిని ఆకస్మికంగా తనిఖీ చేస్తే అసలు విషయం తెలుస్తుందనే డిమాండ్ ఉంది. ఆడిట్ అధికారులు తప్పనిసరిగా సదరు పంచాయతీకి వెళ్లినట్లు జియోట్యాగింగ్ ఫొటోలు, పంచాయతీ సమక్షంలో తీసిన వీడియో ఆధారాలను సమర్పించేలా నిబంధనలు కఠినతరం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పంచాయతీ పాలకవర్గాలు పారదర్శకంగా పనిచేయాలి. కానీ చాలా గ్రామాల్లో పాలకవర్గాలు నిధులు దుర్వినియోగం చేస్తున్నాయి. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా సాగుతున్న ఈ ప్రహసన ఆడిటింగ్‌పై జిల్లా యంత్రాంగం, పంచాయతీ రాజ్ శాఖ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. నిబంధనలను కాగితాలకే పరిమితం చేయకుండా, అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా ఆడిటింగ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఇందూరు అభివృద్ధి కోసం నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్‌కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.

## బీఎల్‌వోలతో సబ్ కలెక్టర్ సమీక్ష



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మంగళవారం ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాల నవీకరణ, పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంపు లేదా తగ్గింపు, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్ల వర్గీకరణ, భవనాల అనుకూలత వంటి ప్రధాన అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు.

## బోధన్ మున్సిపాలిటీలో ఆర్‌డీ విచారణ..



**అక్షర టుడే, బోధన్:** బోధన్ మున్సిపాలిటీలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) షాహిద్ మసూద్ మంగళవారం విచారణ చేపట్టారు. ఉదయమే బోధన్ పట్టణానికి చేరుకున్న ఆయన బల్దియాలో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ ఛాంబర్‌లో సుమారు రెండు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై లోతుగా విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 16వ వార్డులోని శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి కేటాయించిన రూ.20 లక్షల నిధుల వినియోగంపై అందిన ఫిర్యాదు మేరకు ఆర్‌డీ ఈ విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ యాదవ్ కృష్ణ, మాజీ డీఈ శివానందం, ఏఈ శ్రీనివాస్, మాజీ ఛైర్మన్ ఎల్లయ్య, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇలియాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు అనుమతులివ్వాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ అర్వింద్ కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

### తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు..

ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గడంతో పాటు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు తగ్గుతాయని ఎంపీ పేర్కొన్నారు. అలాగే ప్రయాణ భద్రత మరింత మెరుగుపడుతుందన్నారు. దీనిపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ఇటీవల ఇందల్వాయి, జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రికి అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు.



## పలువురు ఏఎస్సైలకు ప్రమోషన్

**అక్షరటుడే, నిజామాబాద్:** బాసర జోన్ పరిధిలో పలువురు ఏఎస్సైలకు ప్రమోషన్ లభించింది. ఈ మేరకు జోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 18 మందికి పదోన్నతి కల్పించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఏఎస్సై జాన్‌సన్ ఎస్సైగా పదోన్నతి పొందారు. ఆయనను నిజామాబాద్ మెడికల్ గ్రౌండ్స్‌కు నియమించారు. జి రాజేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్, ఎ శ్రీనివాస్‌రెడ్డి, బి సాయిలు, ఎండీ లాయక్ అలీ, డి చిన్న గంగారాం, ఎస్‌కే గఫార్, కె బాబు, పి శంకర్, డి రేణుక పదోన్నతి పొందారు. వీరికి బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఏఎస్సైలు అనిత, గంగాధర్, నిర్మల్ జిల్లాకు చెందిన కె లక్ష్మణ్, జగిత్యాలకు జిల్లాకు చెందిన మహ్మద్ జమీల్ అహ్మద్, మహ్మద్ అలీముద్దీన్, కొడిమ్యాల వెంకటేశ్వర్లు, శ్యామ్‌రావు నర్సింగ్‌రావు ఎస్సైలుగా ప్రమోషన్ పొందారు.

## పోలీసుల ఇమేజ్ పెంచేలా పనిచేయాలి : సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోలీసుల ఇమేజ్‌ను పెంచేవిధంగా శాఖలో సిబ్బంది విధులు నిర్వర్తించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని మూడో టౌన్‌ను ఆయన మంగళశారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను పరిశీలించిన సాయిచైతన్య, నాణ్యమైన దర్యాప్తు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, నగరంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వలలు, డ్రగ్స్ రహిత సమాజం, రోడ్డు ప్రమాదాల నివారణపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను భాగం చేసుకోవాలని స్పష్టం చేశారు. సిబ్బంది ప్రతి ఆర్నెళ్లకొకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రయాణాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్ యాదవ్, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సైలు హరిబాబు, నారాయణ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ ఉద్యమాన్ని ప్రారంభించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువు కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి తేడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. బకాయిలు చెల్లించకపోతే ఇందూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.



## కోటగిరిలో ఘనంగా బోనాల పండుగ



**అక్షరటుడే,కోటగిరి:** మండల కేంద్రంలో మంగళవారం శ్రీవేద పాఠశాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనం ఎత్తుకొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణలో అందరిని ఆకర్షించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు బోనాల పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ వేద పాఠశాల డైరెక్టర్ తెల్ల రవికుమార్, కరస్పాండెంట్ అక్షర, ఉపాధ్యాయ బృందం చంద్రకళ, సంగీత,సుప్రియ, పూజ, సావిత్రి, గంగాసాగరి, సంగీత, సువర్ణ, అశ్విని, సాయి, పవన్, సాయినాథ్,రాము, నాగరాజు, భీమ్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

## డ్యూయల్ డెస్క్ బెంచీల వితరణ




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఏనుగు దయానంద రెడ్డి 40 డ్యూయల్ డెస్క్ బెంచీలను వితరణ చేశారు. ఈ బెంచీల వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు సొంత భవన నిర్మాణానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వీలైనంత తొందరగా భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, వీడీసీ అధ్యక్షుడు సల్లూరి సుభాష్ గౌడ్, కళాశాల ప్రిన్సిపల్ జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్లలో సమస్యల పరిష్కారానికి కృషి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని డివిజన్లలో సమస్యల పరిష్కారానికి శాయాశక్తులా కృషి చేస్తున్నామని మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. 49వ డివిజన్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పేర్కొన్నారు. నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల మెరుగుదలతో పాటు ప్రజా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకుందాం..




**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గజానంద్ కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'జలశక్తి అభియాన్ జన భాగీదారీ'లో భాగంగా 'క్యాచ్ ది రైన్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నీరు సమస్త జీవకోటికి ప్రాణాధారమని, దానిని వృథా చేయకుండా రక్షించుకోవడం ద్వారానే భావితరాలకు బంగారు భవిష్యత్తును ఇవ్వగలమని పేర్కొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధులు



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం రూ.58 లక్షల నిధులు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు పరమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను మార్కెట్ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# గిరిజన సంస్కృతికి ప్రతీక

# తీజ్..

**గిరిజనుల విశిష్ట పండుగ అయిన 'తీజ్' వేడుకలు ఉమ్మడి జిల్లాలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పెళ్లికాని యువతులు మంచి భర్త లభించాలని పార్వతీదేవిని వేడుకుంటూ తొమ్మిది రోజుల పాటు కఠిన నిష్టతో ఈ పండుగను జరుపుకుంటారు.** – అక్షరటుడే,గాంధారి

**■ ఉమ్మడిజిల్లాలో ప్రారంభమైన వేడుకలు ■ భక్తితో లబాన, లంబాడీల ఉపవాసాలు ■ ఉత్సాహంగా పాల్గొంటున్న యువతులు**

కామారెడ్డి జిల్లాలో దాదాపు లక్ష మందికి పైగా లబాన, లంబాడీలు ఉన్నారు. 80 గిరిజన తండాలు ఉండగా.. 8వేల కుటుంబాలు కలిసి మొత్తం లక్షకు పైగా జనాభా ఉంటుంది. ప్రతి తండాలో ప్రతి ఏటా నిర్వహించినట్లుగానే తీజ్ పండుగను ఈసారి కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే ఈసారి మహిళలతో నిరసన కార్యక్రమం చేపట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

### తొమ్మిది రోజులు కఠిన దీక్ష..

తీజ్‌లో భాగంగా యువతులు మొదటిరోజు మంగళస్నానం చేసి, బుట్టల్లో గోధుమ గింజలు చల్లి అటకపై ఉంచుతారు. 9 రోజులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. 10వ రోజు సంప్రదాయ దుస్తులు ధరించి, మొలకెత్తిన 'జోరా' (గోధుమ మొలకల) బుట్టలను ఊరేగిస్తూ, ఆడుతూ పాడుతూ చివరకు గంగమ్మ దేవికి సమర్పించి దీక్ష విరమిస్తారు.

### జోరాను తింటే ఆరోగ్యం..

వేడుకల్లో భాగంగా పార్వతీదేవికి నైవేద్యంగా సమర్పించే ఈ 'జోరా'ను తింటే క్యాన్సర్ వంటి రోగాలు దరిచేరవని గిరిజనుల నమ్మకం. యువతులు తాము కోరుకున్న భర్త లభించిన తర్వాతే తమ తీజ్ దీక్షను విడిచిపెడతారు.

### ఈసారి నిరసన కార్యక్రమాలు..

కామారెడ్డి జిల్లాలోని 80 తండాల్లో దాదాపు లక్ష మందికి పైగా లబాన, లంబాడీలు ఉన్నారు. ఈసారి పండుగ వేడుకలతో పాటు తమ రిజర్వేషన్ల సాధనకై మహిళలతో కలిసి నిరసన చేపట్టనున్నట్లు లబాన సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్ బిల్లు సీఎం వద్దకు వెళ్లినా ఆమోదం పొందలేదని, అందుకే తీజ్ వేడుకల్లో ప్లకార్డులతో నిరసన తెలిపి తమ గోడును వినిపిస్తామని పేర్కొన్నారు.

## బాల్కొండ మండలంలో 'జలసిరి' సమావేశం



**అక్షరటుడే, బాల్కొండ:** భూగర్భ జలాల పరిరక్షణ, నీటి సంరక్షణ లక్ష్యంగా మండల కేంద్రంలో 'జలసిరి' మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో 185 ఇంకుడు గుంతలు (సోక్ పిట్స్) నిర్మించడం, ఊర కుంటల పునరుద్ధరణ, పంట కుంటల ఏర్పాటు వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. భూగర్భ జలాల పెంపుతో పాటు వర్షపు నీటిని సంరక్షించే చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రాకేష్, ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో గంగామోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ఏపీఓ ఇందిర, ఏపీఎం గంగారాం, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏలు), ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓలు పాల్గొన్నారు. అలాగే రానున్న రెండు రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో 'జలసిరి' గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## భూగర్భ జలాల పెంపే లక్ష్యం



**అక్షరటుడే, మెండోరా:** మండల ఎంపీడీవో కార్యాలయంలో 'జలసిరి' కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, పంట గుంతలు, ఊట గుంటలు, బోరుబావుల రీఛార్జ్ గుంతల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా భవిష్యత్తులో భూగర్భ జలాల మట్టాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. జల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, గ్రామస్థుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యం రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, తహశీల్దార్, మండలంలోని సర్పంచులు, అధికారులు, వీఓ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సంతకాలు ఫోర్జరీ చేసిన ముగ్గురి అరెస్ట్




**అక్షరటుడే, కామారెడ్డి:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్ర మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ మండలంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధికోసం పలువురి దరఖాస్తులపై గెజిటెడ్ ఆర్‌ఎంవో సంతకం ఫోర్జరీ జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు డీఎస్పీ మధుసూదన్ రావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితులు మొత్తం 52 దరఖాస్తులను అధికారులకు సమర్పించినట్లు తేలింది. వాటిలో 36 మంది లబ్ధిదారులకు ఇప్పటికే ప్రభుత్వ ఆర్థిక సహాయం మంజూరైంది. మరో 18 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి. ఈ దరఖాస్తులపై పూర్తిస్థాయి విచారణ కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని, లబ్ధి పొందిన 36 మంది అర్హతపై విచారణ చేయాలని ప్రభుత్వానికి రాస్తామని ఎస్పీ తెలిపారు. ప్రాసెస్‌లో ఉన్న 18 దరఖాస్తులను వెంటనే నిలిపివేయాలని ఉన్నతాధికారులను కోరతామన్నారు. భిక్కనూర్‌లో జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్న బోయిని ప్రసాద్ ఈ ఫోర్జరీకి ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సంతకాల ఫోర్జరీ, డాక్యుమెంటేషన్ బాధ్యత ప్రసాద్ చూసేవాడని, లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసే పనిని తొడెంగల రాజా, రాజేందర్ అనే తండ్రీకొడుకులు నిర్వహించేవారని ఎస్పీ చెప్పారు. ఒక్కో దరఖాస్తుకు రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నట్టుగా ఎస్పీ తెలిపారు. ఈ ఇద్దరు గతంలో కామారెడ్డి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసి దరఖాస్తుల ప్రాసెస్‌ను పూర్తిగా అర్థం చేసుకున్నారని సమాచారం ఉందని తెలిపారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఆర్‌ఎంఓతో పాటు రిటైర్డ్ ఆర్‌ఎంఓ, మెడికల్ ఆఫీసర్ల సంతకాలను కూడా నిందితులు ఫోర్జరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

## 'కంటైనర్' స్కూల్‌కు నోటీసులు



అక్షర టుడే కథనానికి స్పందన

**అక్షరటుడే, నందిపేట్:** కంటైనర్‌లో పాఠశాల నిర్వహిస్తున్నారని పేర్కొంటూ 'అక్షర టుడే'లో 'కంటైనర్ చదువులు.. విద్యార్థులకు అవస్థలు' శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా విద్యాశాఖ స్పందించింది. ఈ మేరకు నందిపేట్ ఎంఈవో అవధూత గంగాధర్ నందిపేట్ మండలంలోని వన్నెల్ (కె)లో జీఎఫ్ఎస్ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఇనుప కంటైనర్‌లను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించినందుకు స్కూల్ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో సంబంధిత యాజమాన్యం వివరణ ఇవ్వాలని సూచించారు. మూడురోజుల్లో వివరణ ఇవ్వని పరిస్థితుల్లో స్కూల్ గుర్తింపునకు సంబంధించి తదుపరి చర్యల నిమిత్తం డీఈవోకు నివేదిక పంపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యతో ప్రైవేట్ పాఠశాలలో మౌలిక వసతులు, భద్రత ప్రమాణాలపై విద్యాశాఖ మరింత దృష్టి సారిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది.

## మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కౌన్సిలర్లు, వార్డ్ మెంబర్ల సామర్థ్యాలను పెంచేందుకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఎల్లారెడ్డి నుంచి ఈ శిక్షణ తరగతులకు మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తరలివెళ్లారు. స్థానిక సంస్థల్లో పాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, పారిశుధ్యం, దోమల నివారణ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, పౌర సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కౌన్సిలర్లకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించారని తెలిపారు.

## కిసాన్‌నగర్‌లో కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్‌లో లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, సీనియర్ సభ్యులు కిషన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు మెడికల్ కిట్ల అందజేత




**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు మెడికల్ కిట్లను అందజేశారు. ఇందల్వాయి, తిర్మన్‌పల్లి, నల్లవెల్లి, సిర్నపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఫౌండేషన్ ఛైర్మన్ బాలకృష్ణ, నర్సోత్తం, ముత్యం, నరేష్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** తాళ్లరాంపూర్ తాజా మాజీ సర్పంచ్ బెజ్జారం పావని ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె భర్త భానుని తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు అబ్బగోని అశోక్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. చిన్న వయసులోనే సర్పంచ్‌గా గెలిచి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నటువంటి పావని అకాలమరణం తమను ఎంతో కలిచివేసిందన్నారు. పావని భర్త భానుకు ధైర్యం చెప్పారు.